క్లుప్తంగా

రేషన్ కార్డుల సర్వే



ముష్టికుంట్లలో సర్వే చేస్తున్న అధికారులు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో నూతనంగా మంజూరైన రేషన్ కార్డుల లబ్ధిదారుల వద్దకు వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పున్నం చందర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 22 గ్రామాలకు సంబంధించి 2,988మంది లబ్ధిదారులు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వల్లాపురంలో..

ముదిగొండ: మండలంలోని వల్లాపురంలో తహసీల్దార్ సునీతఎల్జిబెత్ శుక్రవారం రేషన్ కార్డులను సర్వే చేశారు. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను ఆమె పరిశీలించారు. అనంతరం ఇసుక కూపన్లను తనిఖీ చేశారు. కూపన్లు లేనివారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రామయ్య

వైరా: హరించ బడుతున్న కార్మిక హక్కుల పరిరక్షణకై పోరాడుతున్న టీయూసీఐ జిల్లా మహాసభలు ఈ నెల 13, 14 తేదీల్లో వైరాలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రామయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఈ నెల 9 న వైరాలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, యలదండి బాబు, సీపై పుల్లయ్య, అర్జునరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

కల్లూరు: ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఖమ్మం జిల్లా ప్రధమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం కల్లూరులో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు వెంకన్న మాట్లాడుతూ.. ఈ నెల 13న వైరాలో కామిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించే మహాసభకు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు పుల్లారావు, హమాలీ సంఘం నాయకులు ఏడు కొండలు, వెంకట్రావు, వీరయ్య, శ్రీను, జగదీష్, సీతన్న పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి

బోనకల్: ప్రభుత్వం విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ కోరారు. శుక్రవారం బోనకల్‌లో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని, నూతన పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు సద్దాబాబు, సౌభాగ్య లక్ష్మి, నరసింహారావు, వెంకటేశ్వర్లు, నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ అప్పగించిన కండక్టర్, డ్రైవర్

మధిర: బస్సులో మరిచిపోయిన ఫోన్‌ను మధిర డిపోకు చెందిన అద్దె బస్సు డ్రైవర్, కండక్టర్లు తిరిగి ప్రయాణికుడికి అందజేశారు. బస్సు శుక్రవారం తెల్లవారుజామున మధిర నుంచి హైదరాబాద్ బయలుదేరగా, వైరా బస్టాండ్‌లో రాయల వెంకట్ ఖమ్మం వెళ్లేందుకు ఎక్కాడు. ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌లో దిగిన ఆయన బస్సులోనే ఫోన్ మరిచిపోయాడు. ఇంటికి వెళ్లాక ఈ విషయాన్ని గుర్తించి తన నంబర్‌కు ఫోన్ చేయగా అప్పటికే భద్రపర్చిన కండక్టర్ పి.అనూష, డ్రైవర్ ఓ.సైదులు హైదరాబాద్ నుంచి వచ్చాక తీసుకోవాలని సూచించారు. దీంతో బస్సు తిరిగి వచ్చే క్రమాన వెంకట్‌కు వైరా బస్టాండ్‌లో కంట్రోలర్ చేతుల మీదుగా ఫోన్ అందించారు.

పరామర్శ..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలో మృతుల కుటుంబాలను జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్ శుక్రవారం పరామర్శించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన వడ్డేపూడి చిననర్సయ్య, షేక్ నాగుల్‌మీరా కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పుల్లయ్య, నాయకులు హనుమంతురావు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం దళారులకే..

- దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లు
- ప్రభుత్వ కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం



రవాణా చేసేందుకు కాంటా వేసి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు



ధాన్యం తూకం వేస్తున్న ప్రైవేట్ వ్యాపారుల సిబ్బంది

కల్లూరురూరల్: యాసంగి ధాన్యం దళారుల పాలవుతోంది. గ్రామాల్లో తిరిగి ప్రైవేట్ వ్యాపారులు దొడ్డు రకం ధాన్యాన్ని ముమ్మరంగా కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వ ధాన్యం కొఉగోలు కేంద్రాలు ఇంకా సరిగ్గా ప్రారంభించక పోవడం, పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం దొడ్డా రకం ధాన్యం క్వింటాకు మద్దతు ధర రూ.2,300 ప్రకటించినప్పటికీ రైతులు తమ ధాన్యాన్ని క్వింటాలకు రూ.2వేల నుంచి రూ.2,100లకు విక్రయిస్తున్నారు. వ్యాపారులు రైతుల పొలాల వద్దకు, ఇళ్ల వద్దకు వచ్చి ధాన్యం కాంటా వేసి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తమకు రవాణా ఖర్చులు తగ్గుతుండటంతో పాటు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విధించిన నిర్ణీత ప్రమాణాలు ఏవీ కూడా ఇక్కడ పాటించకపోవడం వల్ల సులభంగా తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు రైతులు విక్రయిస్తున్నారు.

మండలంలో 20వేల ఎకరాలలో..

కల్లూరు మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో ఈ ఏడాది యాసంగి వరి ధాన్యం పండించారు. యాసంగి ధాన్యం ఎకరానికి 45 నుంచి 55 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. దీంతో కల్లూరు మండలంలో సుమారు 3.80 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి అవుతుంది. ఇందులో సింహభాగం ప్రైవేట్ వ్యాపారులే కొనుగోలు చేస్తున్నారు.

రైతుల వెనుకడుగు..

ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తెచ్చేందుకు ఆసక్తి చూపించటం లేదు. కేంద్రాల్లో ధాన్యం ఆరబోసేందుకు సరైన స్థలం లేకపోవడం ప్రధాన కారణం. అందువల్ల రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోస్తున్నారు. అదే విధంగా ధాన్యం కేంద్రాల్లో పట్టాలు లేకపోవడం ప్రధాన కారణం. అకాల వర్షం వచ్చినట్‌లెతై ధాన్యం తడిసి పాడైపోతాయని రైతులు భయపడుతున్నారు. తడిసి ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చయనట్లయితే తాము నష్టపోతామని రైతులు భావిస్తున్నారు. సరైన సమయానికి ధాన్యం కాంటా వేయకపోవడం వల్ల ధాన్యం రాశుల వద్ద పడిగాపులు కాయవలసి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

ప్రైవేట్ వ్యాపారులకే విక్రయిస్తున్నా..



ప్రభుత్వం ఆలస్యంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. కల్లూరు మండలంలో కేవలం రెండు చోట్ల మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మిగిలి గ్రామాల్లో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు. తాము పండించిన ధాన్యం ఆరబోసుకునేందుకు సరైన స్థలం లేదు. దీంతో అకాల వర్షాలు వచ్చినట్‌లెతై ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు ఎఫ్‌సీఐ నిబంధనల వల్ల ఇబ్బందిగా ఉంది. అందువల్ల ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నాం.

– తాళ్లూరి శ్రీనివాసరావు, రైతు, పెద్దకోరుకొండి

కనీస సౌకర్యాలు లేవు..



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో తెచ్చిన ధాన్యం ఎక్కడ ఆరబోయాలో తెలియని పరిస్థితి. సరైన సమయానికి గన్ని బస్తాలు అందుబాటులో ఉండవు. కాంటాలు వేయడంలో ఆలస్యం, రవాణా వాహనాలు సమయానికి రాక ఇబ్బంది పడాల్సి వస్తోంది. అదే ప్రైవేట్ వ్యాపారులైతే ఇళ్ల వద్దకే వచ్చి ధాన్యం కాంటాలు వేసి మరీ తీసుకెళ్తున్నారు. అందుకే ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించేందుకు మొగ్గు చూపాల్సి వస్తుంది.

– పువ్వాడ వెంకటేశ్వరరావు, రైతు, యజ్ఞనారాయణపురం

అలరించిన నాట్య ప్రదర్శనలు



కళాకారుల నాట్య ప్రదర్శన

మధిర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో స్థానిక సుమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధిర రైల్వే కాలనీ శ్రీ కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో జరుగుతున్న సాంస్కృతిక కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. స్వామి వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కూచిపూడి, ఆంధ్రనాట్యం, పేరిణి శివతాండవం నాట్య ప్రదర్శనలు రసవత్తరంగా సాగాయి. గురువులు శ్రీనివాస్, మనోజ రెడ్డి ఆధ్వర్యంలో నవగ్రహ స్తోత్రాలు, సూర్యాష్టకం, గణపతి ఆనందం, నారాయణ తీర్థుల తరంగాలు, వీరావేశ పేరిణి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. అనంతరం సుమిత్ర యూత్ అసోసియేషన్ వారు ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా నాటిక.. కుటుంబంలో ఉండే ఒడిదుడుకులను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కార్యక్రమాన్ని భారతీయుడు పురస్కార గ్రహీత, కళాబంధు బొబ్బిళ్లపాటి గోపాలకృష్ణ సాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు మల్లేష్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిభానుపూడి సుబ్బరాజు, కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



గోకినేపల్లిలో వరి పంటను అంచనా వేస్తున్న అధికారులు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో శుక్రవారం మధిర ఏడీఏ ఎస్ విజయ్‌చంద్ర వరి పంటలను పరిశీలించారు. రైతులు పండించిన పంట దిగుబడిని అంచనా వేసేందుకు వరి కంకులను తీసి గింజలను లెక్కించారు. గ్రామంలోని ఓ రైతు పొలంలోని వరిపంట నమోదును అంచనా వేశారు. ఆయిల్ పాం సాగు అధిక మొత్తంలో సాగు చేపడితే మేలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ వేణు, ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి పట్టాభిషేక మహోత్సవం



లక్ష్మీఆరాధన పూజలో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిరూరల్: కిష్టారం శ్రీకోదండరామస్వామి దేవాలయం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీకోదండ రామస్వామి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామతారక యజ్ఞం, శ్రీలక్ష్మీనారాయణ యజ్ఞం, స్వామికి స్వర్ణకిరీట ధారణ, సామూహిక లక్ష్మీ ఆరాధన, సర్వదైవత్వ హోం, విశేష పూజలు నిర్వహించారు. టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మంత్రి తుమ్మల రాక..

శనివారం ఆలయంలో నిర్వహించే శ్రీలక్ష్మీ సుదర్శన హోమం, పూజా కార్యక్రమాలకు రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరవుతారని ఆలయ కమిటీ నిర్వహులు తెలిపారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు ప్రతిపాదనలు

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్‌కు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ శుక్రవారం ఖమ్మంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ప్రతిపాదనలు అందించారు. అభివృద్ధి పనులపై చర్చించ్చారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా

మధిర: ఆర్టీసీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. స్టాఫ్ అండ్ వర్కర్ల ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం మధిర ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు బిక్షపతి భగీరయ్య తదితరులు పాల్గొని మాట్లాడారు. 2021 వేతన ఒప్పందం అమలుచేసి ఏరియర్స్ చెల్లించాలని, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అప్పారావు, రమేష్ కుమార్, వెంకటేశ్వరరావు, శ్రీను, కృష్ణారావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో బంగారు పతకం



పతకం అందుకుంటున్న గీతాశ్రీ

తల్లాడ: మైసూర్ దత్త పీఠం ఆధ్వర్యాన ఆన్‌లైన్‌లో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో తల్లాడకు చెందిన బండారు జనార్దన్ – ఉషారాణి కుమార్తె కంచెర్ల గీతాశ్రీ బంగారు పతకం సాధించింది. ఈసందర్భంగా హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా పతకం అందుకుంది.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

కారేపల్లి: కారేపల్లి నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు శుక్రవారం కారేపల్లి బస్టాండ్ సెంటర్లో మొరాయించింది. దీంతో ప్రయాణికులు దిగి.. ప్రైవేట్ వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు. సుమారు గంటపాటు రోడ్డుపై బస్సు ఉండడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది అయ్యింది.

గురుకులంలో విద్యార్థులకు సీట్లు

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యారు. గురుకుల విద్యాలయాలు ఫలితాలను ప్రకటించగా పరీక్ష రాసిన ఏడుగురు విద్యార్థులు గురుకులంలో సీట్లు సాధించారు. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ మురళీమోహన్‌రావు, ప్రధాన ఉపాధ్యాయుడు మద్ది నాగేశ్వరరెడ్డి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్ రంగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ బంగారమ్మ, పేరంట్స్ గామసు జోగయ్య తదితరులు ఉన్నారు.

మోదీ ఫొటో పెట్టాలి



తహసీల్‌లో వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పెనుబల్లి: మండలంలోని అన్ని రేషన్ షాపుల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని పెనుబల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బొర్రా నరసింహారావు ఆధ్వర్యంలో తహసీల్‌లో వినతిపత్రం అందించారు. గరీబ్ కల్యాణ యోజన పథకం ద్వారా ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తున్నారని, వాటి వివరాలు లబ్దిదారులు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూధన్‌రావు, మహేష్, సుధాకర్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నిరసనలో పాల్గొన్న ముస్లింలు

సత్తుపల్లి: వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం ముస్లిం సంఘాలు జామె మసీద్ నుంచి బస్టాండ్ రింగ్ సెంటర్ వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా జామె మసీద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె నాయబ్‌రసూల్, ఎండి కమల్‌పాషా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ముస్లింల హక్కులను కాలరాస్తూ వక్ఫ్ బిల్లును ఆమోదించటం దారుణమన్నారు. ఈ ప్రదర్శనకు కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె రఫీ, ఎస్‌కె మౌలాలీ, ఎండీ రియాజుద్దీన్, షాకీర్, అమీర్‌జాని, ఆదిల్ షరీఫ్, రఫీ, ఇమామ్, చెన్నారావు, సామేలు, రాజబాబు పాల్గొన్నారు.

రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు



రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లి: ప్రతీ గ్రామానికి రహదారి నిర్మించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే మట్టా రాగమయి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15నెలల్లోనే రూ.800 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రాగమయి సత్తుపల్లిలోని రేజర్లలో రూ. 2.12 కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించడంతో పాటు.. రూ. 2.75 కోట్లతో చేపట్టే బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావులతో కలిసి ఎమ్మెల్యే రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టసత్తెమ్మతల్లి ఆలయంలో వారిని ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, భీమిరెడ్డి సుబ్బారెడ్డి, నారాయణవరపు శ్రీనివాస్, జక్కుల ప్రభాకర్, దోమ ఆనంద్‌బాబు, తోట సుజలరాణి, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలి



చింతకాని: మత్కేపల్లిలో బియ్యం పంపిణీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ అనంతరాజు

కల్లూరురూరల్/చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం శుక్రవారం నుంచి కల్లూరు మండలంలో ప్రారంభమైంది. మండలంలోని 33 రేషన్ షాపుల ద్వారా రేషన్‌కార్డు వినియోగదారులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా చింతకానిలోని.. మత్కేపల్లి, జగన్నాథపురం గ్రామాల్లోని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ అనంతరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డులోని ప్రతి వ్యక్తికి ఒక యూనిట్ లెక్కన ఆరు కేజీల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, తహసీల్దార్ సాంబశివుడు, గిర్దవర్ సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు నాగార్జున్, కోటేశ్వరరావు, రామారావు, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కారేపల్లి సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు

కారేపల్లి: రైతులు తమ ధాన్యం, మొక్కజొన్న పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని విశ్వనాథపల్లి, సీతారాంపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మాధారం గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా రైతులు కారేపల్లి సొసైటీలో తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించి, రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో చెల్లించిన రైతులకు ప్రభుత్వం 3శాతం వడ్డీ రాయితీని కల్పిస్తుందన్నారు.

పరిశుద్ధ శిలువ యాత్ర



ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

వైరా: వైరా ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం తపస్సుకాల దీక్షల కార్యక్రమంలో భాగంగా చర్చి ఫాదర్ మాదాసు రాజు ఆధ్వర్యంలో వైరా రిజర్వాయర్‌ను ఆనుకుని ఉన్న కల్వరి కొండ ప్రాంతంలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాన్‌బాస్కో ప్రిన్సిపల్ ఫాదర్ ప్రదీప్‌రెడ్డి ఉపవాస దీక్షలు, ప్రార్థన విలువల గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు, దీక్షా పరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసానికి దరఖాస్తుల వెల్లువ

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకం కింద రాయితీ రుణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సుమారు 200 దరఖాస్తులు వచ్చాయి. కార్యాలయంలో ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించటంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఆదాయ, కుల, ధ్రువపత్రాలు సకాలంలో రాక ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ప్రభుత్వం దరఖాస్తుల గడువును ఈ నెల 14వ తేదీ వరకు పొడిగించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారు కూడా మున్సిపల్ కార్యాలయంలో ఆఫ్‌లైన్ దరఖాస్తు ఫారాలను నింపి అందించాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ మైసా శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది నరేష్, సుధాకర్, శివకృష్ణ పాల్గొన్నారు.

నేత్రదానం

వేంసూరు: మండల చౌడవరం గ్రామానికి చెందిన ఆళ్ల గోపాలరావు గురువారం మృతి చెందగా ఆయన కుమారులు ఆళ్ల వెంకటరాజు, నరసరాజు, కృష్ణ అంగీకారంతో రాయపూడి పద్మనాభం సహకారంతో ఖమ్మం నేత్రనిధి వారు నేత్రాలను సేకరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పాఠశాలలో ఉపాధ్యాయులు, బాలికలతో ఎంఈఓ అబ్రహం

కొణిజర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు బాల బాలికలకు అనేక సదుపాయాలు అందుతున్నాయని ఎంఈఓ దొడ్డిగర్ల అబ్రహం అన్నారు. శుక్రవారం హెచ్‌ఎం యం.రజని అధ్యక్షతన నిర్వహించిన తుమ్మలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల ప్రకటించిన గురుకుల ఫలితాల్లో తుమ్మలపల్లి పాఠశాల విద్యార్థులు 10మంది సీట్లు సాధించడంతో ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం బాల బాలికలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, రాధా, హదస్సా, భాస్కర్, వీరన్న, జ్యోతి, శ్రీలత స్థానికులు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి నూతన శోభ

రూ.21 లక్షలతో పనులు



ఆలయం ముందు ఏర్పాటు చేసిన పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం

తల్లాడ: మండలంలోని నారాయణపురం కోదండ రామాలయం రూ.21 లక్షలతో జరిగిన అభివృద్ధి పనులతో నూతన శోభను సంతరించుకుంది. ధర్మకర్తలు, గ్రామస్తుల సహకారంతో ఈ ఏడాది రామాలయాన్ని అభివృద్ధి చేశారు. దాతల సహకారంతో శ్రీరామ నవమికి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దేవాలయం చుట్టూ సోలార్ నిర్మాణం, రేకుల షెడ్డు, టైల్స్ ఏర్పాటు చేశారు. దేవాలయానికి ఖరీదైన రంగులు వేయించారు. 1957లో ఈ ఆలయాన్ని నిర్మించగా.. 2008లో గ్రామస్తుల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం ముందు ధ్వజస్తంభం పున ప్రతిష్ఠ, ఆలయానికి కుడి వైపున పలు దేవతా విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటిని రంగులు అద్దడంతో ఆలయం కళకళలాడుతుంది. ఆలయం ముందు పంచముఖ ఆంజనేయ స్వామిని ఏర్పాటు చేశారు. ఈ నెల 6న శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించడానికి ఆలయాన్ని అన్ని హంగులతో సిద్ధం చేశారు. ఆలయ అర్చకులు విఖనసా చార్యులు ప్రతి రోజు ఇక్కడ నిత్య నైవేద్యం సమర్పిస్తారు.



నారాయణపురంలో నూతన శోభను సంతరించుకున్న కోదండ రామాలయం



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దేవతా మూర్తుల విగ్రహాలు